ప్రజాశక్తి
బుధవారం 3 డిసెంబర్ 2025
5
విజయనగరం



ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2025-26 విద్యా సంవత్సరానికి (ఎపి ఓపెన్ స్కూల్) పదో తరగతి. ఇంటర్ కోర్సులలో ప్రవేశాలకు రూ.600 తత్కాల్ అపరాధ రుసుముతో దరఖాస్తులు చేసుకోవచ్చని డిఇఒ యు.మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దగ్గరలో గల ఓపెన్ స్కూల్ సెంటరుకు వెళ్లి అభ్యర్థి అడ్మిషన్ నిర్ధారించబడే వరకు సంబంధిత కోఆర్డినేటర్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించాలని తెలిపారు. కోఆర్డినేటర్లు దరఖాస్తులతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను సంబంధిత ఎసిజిఇ/డి సి ద్వారా తత్కాల్ కమిటీకి దరఖాస్తులను సమర్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందాలని, పరీక్ష ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు.

ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం

కలెక్టర్ రామసుందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో పలు జాతీయ ప్రాజెక్టులకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణపై తమ ఛాంబర్లో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ రహదారి 130 (సిడి), జాతీయ రహదారి 516(బి), రైల్వే ఆర్ఒబిలు, జి.సిగడాం-విజయనగరం మూడో రైల్వేలైన్, కొత్తవలస-విజయనగరం నాలుగో రైల్వేలైన్ తదితర ప్రాజెక్టులకు భూసేకరణపై సమీక్షించారు. భూసేకరణ ప్రకటన, పరిహారం చెల్లింపు తదితర అంశాలపై ఆరా తీశారు. వీటన్నిటినీ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ ప్రాజెక్టుకు నిర్ణీత కాలవ్యవధిని నిర్ణయించుకొని, నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్, ఆర్‌డిఓలు డి.కీర్తి, సత్యవాణి, రామ్మోహన్, ఈసెక్షన్ సూపరింటిండెంట్ తాడ్డి గోవింద, ఆయా శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర వివరాలతో సమావేశానికి హాజరుకావాలి

ఈనెల 4న జరగనున్న జిల్లా సమీక్షా సమావేశానికి అధికారులంతా సమగ్రమైన వివరాలతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా, జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్‌తో కలిసి మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో ముందస్తుగా ప్రిలిమినరీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షకు అవసరమైన పూర్తి సమాచారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా గత సమావేశానికి సంబంధించి యాక్షన్ టేకెన్ రిపోర్ట్ పై ప్రధానంగా చర్చించారు. తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ, సమీక్షా సమావేశంలో ప్రధానంగా ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై వివరంగా చర్చ జరిగే అవకాశం ఉందని తెలిపారు. దీనికి అనుగుణంగా, అధికారులు ఆయా పథకాలకు సంబంధించిన డేటా, ఇప్పటివరకు సాధించిన లక్ష్యాలు, మరియు పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయం, నీటి పారుదల, ప్రాజెక్టులు, గృహ నిర్మాణాల పురోగతి, పారిశుధ్యం, వైద్యారోగ్యం, మౌలిక సదుపాయాల కల్పన వేగవంతంపై దృష్టి సారించాలని చెప్పారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల ప్రణాళిక, నీటిపారుదల ప్రాజెక్టుల స్థితిగతులు, ధాన్యం సేకరణ, విద్య, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఆరోగ్యశ్రీ సేవలు అందించే తీరుపై పూర్తి వివరాలు సమర్పించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ మాట్లాడుతూ, జిల్లా సమీక్షా సమావేశంలో నివేదికలు కేవలం సంఖ్యాపరంగా కాకుండా, పథకాల అమలులో క్షేత్రస్థాయి ప్రభావం ఎలా ఉందో తెలియజేయాలని సూచించారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, జిల్లా స్థాయి అధికారులు, పలుశాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.





షాట్‌పుట్‌లో పాల్గొన్న వికలాంగ క్రీడాకారుడు ; పోటీలను ప్రారంభిస్తున్న సమగ్ర శిక్ష ఎపిసి, డిఎస్‌డిఒ తదితరులు

ఉత్సాహంగా జిల్లా స్థాయి పారా క్రీడలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సహకారంతో మంగళవారం స్థానిక విజ్జి స్టేడియంలో వికలాంగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త ఎ.రామారావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వర రావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ లతో కలిసి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయని, వైకల్యాన్ని జయించే శక్తి క్రీడలకు ఉందని అన్నారు. ప్రభుత్వాలు కూడా పారా క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, ప్రతీ ఒక్కరూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకునేలా క్రీడల్లో రాణించాలని అన్నారు. రన్నింగ్, షాట్ పుట్, డిస్కస్, జావలిన్ లాంగ్ జంప్, హై జంప్ క్రీడలనుజూనియర్, సబ్ జూనియర్ విభాగాలకు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 150 మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జోనల్ స్థాయికి ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమలో సమగ్ర శిక్ష జిల్లా కో ఆర్డినేటర్ ఎస్. సూర్యారావు, సహాయక కో-ఆర్డినేటర్ ఎం.భారతి, పీడీలు, కోచ్‌లు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి

- గంజాయి మాఫియాను అరికట్టాలి
- సిపిఎం నాయకులు శంకర్రావు



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కాలనీ వాసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నెల్లూరులో ప్రజానాట్య మండలి కళాకారుడు, యువకుడు పెంచలయ్యను గంజాయి మూకలు దాడిచేసి హత్య చేసిన ఘటనను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం రామకృష్ణానగర్‌లో నిరసన తెలిపారు. తొలుత పెంచలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ హత్య కేసు నిందితులందరినీ కఠినంగా శిక్షించాలని, పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి దారుణాలు పునరావతం కాకుండా చూడాలని,రాష్ట్రంలో గంజాయి మాఫియా ను అరికట్టాలని అన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ఎం.శాంతమూర్తి, ఎం.జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లోకో పైలట్‌ల 48 గంటల దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైల్వేలో ప్రైవేటీకరణ విధానాలు ఆపాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా రైల్వే లోకో పైలట్ స్టాఫ్ అసోసియేషన్ పిలుపులో భాగంగా విజయనగరం రైల్వే లోకో పైలట్ లు 48 గంటల నిరవధిక దీక్ష మంగళవారం చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ, ఉపాధ్యక్షులు ఎ.గౌరి నాయుడు, కోశాధికారి ఎ.జగన్మోహన్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సోమేష్ సందర్శించి మద్దతు తెలిపారు. రైల్వే లో ప్రైవేటీకరణ విధానాలు వెంటనే ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే వారి పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు.



నిరవధిక దీక్ష చేస్తున్న లోకో పైలట్‌లు



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ వివిధ స్వయం ఉపాధి కోర్సులలో ఉచితంగా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. విజయనగరం లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో రిఫ్రిజరేషన్ అండ్ ఎసి మెకానిక్స్, వీడియో గ్రాఫిక్స్ అండ్ ఫోటోగ్రఫీ కోర్సుల శిక్షణా తరగతులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రెండు కోర్సుల్లో ఇచ్చే శిక్షణ యువతకు చక్కని ఉపాధి మార్గం చూపుతుందని, ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా జూనియర్ బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డి. భాస్కరరావు, అధ్యాపకులు హర్ష, వర్మ, విశ్రాంత ఎల్డీఎం శ్రీనివాసరావు, కెనరా బ్యాంక్ విశ్రాంత చీఫ్ మేనేజర్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అధ్యక్ష పీఠంపై కొనసాగుతున్న ఉత్కంఠ

మూడోవారంలో తెరపడే అవకాశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి జిల్లా అధ్యక్ష పదవిపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. డిసెంబర్ మూడో వారంలో ఈ ఉత్కంఠకు తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లా రథసారధి ఎంపికపై అదుగో ఇదిగో అంటూ టిడిపి అధిష్టానం కాలయాపన చేస్తున్న సంగతి విధితమే. దీంతో, ఆశావహులు ఒకింత ఆశా నిరాశలతో ఉన్నారు. పలు జిల్లాల్లో సామాజిక సమీకరణాలు, తీవ్ర పోటీ వంటి కారణాల వల్ల జాప్యం జరిగినట్టుగా తెలుస్తోంది. జిల్లా అధ్యక్షుని ఎంపిక కోసం అభిప్రాయ సేకరణ చేపట్టేందుకు ఆగస్టు 26న రాష్ట్ర కేంద్రం నుంచి త్రిసభ్య కమిటీ (శాసనమండలి మాజీ చైర్మన్ ఎమ్‌డి ఫరూక్, కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు) జిల్లాకు వచ్చిన సంగతి విదితమే. వీరంతా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వివిధ కమిటీల చైర్మన్లు, ఇతర ముఖ్య నాయకులతో చర్చించారు. మొత్తంగా అప్పట్లో ఏడుగురి అభ్యర్థిత్వంపై నాయకుల అభిప్రాయాలు తీసుకున్నట్టుగా సమాచారం. వీరిలో నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి సువ్వాడ రవిశేఖర్, కంది చంద్రశేఖర్, గజపతినగరం నియోజక వర్గానికి చెందిన కరణం శివరామకృష్ణల పేర్లు పరిశీలన వరకు వెళ్లాయని సమాచారం. సువ్వాడ తీవ్రంగా ప్రయత్ని స్తున్నట్టుగా తెలుస్తోంది. పదవిపై ఆయన ఒకింత ధీమా కూడా వ్యక్తం చేస్తున్నారు. అభిప్రాయ సేకరణ పూర్తిచేసి సుమారు మూడు నెలలు కావస్తున్నా ప్రకటించకపోవడంతో టిడిపి కేడర్ ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. ఈనెల 17న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమీక్ష అనంతరం ప్రకటన ఉంటుందంటూ ఇటీవల రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ ప్రకటించిన నేపథ్యంలో ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. ఈనేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల అధ్యక్షులను ఒకేసారి ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. సామాజిక ప్రాధాన్యతల రీత్యా లోకేష్ దృష్టిలో మరోసారి పెట్టాల్సిరావడం వల్ల కాస్త ఆలస్యం జరిగినట్టుగా పలువురి నాయకుల నోట వినిపిస్తోంది. ముఖ్యంగా మిగిలిన జిల్లాలతో పోల్చుకుంటే మన జిల్లాలో ప్రతిపక్షం చురుకుగానే ఉంటోంది. అవకాశం దొరికిన ప్రతి సందర్భంలోనూ వైసిపి నేతలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తునే ఉన్నారు. కొన్ని సందర్భాల్లో వైసిపి జిల్లా నాయకుల స్టేట్‌మెంట్లకు నేరుగా మంత్రులే రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం ఉన్న జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జునకు డిసిసిబి ఛైర్మన్ పదవి కట్టబెట్టిన తరువాత గతంతో పోలిస్తే స్పీడు తగ్గింది. ఈనేపథ్యంలో సమర్థతగల నాయకులను పార్టీ పదవుల్లో పెట్టాలనే మరో కోణంలో కూడా పార్టీ ఆలోచన చేస్తోందని అధికార పార్టీ నేతల్లో చర్చ నడుస్తోంది.

ఎస్ఎఫ్ఐ నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని మరోసారి నిరూపణ అయింది. రెండేళ్ల క్రితం శృంగవరపుకోటలో గల గిరిజన బాలికల హాస్టల్‌లో తగిన సౌకర్యాలు లేవని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వందమందికి పైగా విద్యార్థులు ఉన్న హాస్టల్ కు కనీస సౌకర్యాలు అయిన ప్రహరీ గోడ, రక్షణగా గేటు లేకపోవడం, విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేకపోవడంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాడారు. రాస్తారోకో చేపట్టారు. ఆ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీసులు స్టేషన్‌కు తరలించారు. తమ కోసం పోరాడుతున్న నాయకత్వాన్ని అరెస్టు చేయడంతో హాస్టల్ విద్యార్థులంతా పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. విద్యార్థుల ఆందోళనకు దిగివచ్చిన పోలీసులు ఆనాడు ఎస్ఎఫ్ఐ నాయకులను విడిచిపెట్టారు. కానీ తమ మాట వినలేదని సాకుతో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి. చిన్నబాబుతో సహా నలుగురిపై అక్రమ కేసులు బనాయించారు. రెండేళ్ల తర్వాత మంగళవారం ఎస్.కోట జూనియర్ సెషన్స్ న్యాయస్థానం విద్యార్థి నాయకులపై పెట్టిన కేసులను కొట్టివేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి చిన్నబాబు, డి రాములు మాట్లాడుతూ ఎప్పటికైనా పోరాటమే విజయం సాధిస్తుందని తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో కేసులు పెట్టడంలో ఉన్న శ్రద్ధ అదే గిరిజన అమ్మాయిల వసతి గృహాన్ని బాగు చేయాలనే దానిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోయిందని విమర్శించారు. కేసులు ఎదుర్కొన్న వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.చినబాబు , జిల్లా ఉపాధ్యక్షులు కె.రమేష్, అప్పటి ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం హర్ష , రాము ఉన్నారు.



సచివాలయంలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న కమిషనర్ పి.నల్లనయ్య

బిపిఎస్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవనాలు, లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని ప్రణాళిక అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో లైసెన్స్ టెక్నికల్ పర్సన్ లతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భవన, లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకాలు సద్వినియోగం అయ్యేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ప్రతి భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఉన్న అనుమతులకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్న విషయాన్ని గమనించాలన్నారు. లేని పక్షంలో అనుమతులకు అతిక్రమించి జరిగిన నిర్మాణాలను తొలగించాలని ప్రణాళిక సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రామణమూర్తి, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

సచివాలయం పరిశీలన

నగరంలో పలు ప్రాంతాల్లో కమిషనర్ నల్లనయ్య పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. నిర్ణీత సమయానికి పారిశుధ్య కార్మికులు విధులకు హాజరవుతున్నారా లేదా అన్న విషయాన్ని పట్టిక ద్వారా పరిశీలించారు. అనంతరం 30వ నెంబర్ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అన్న క్యాంటీన్‌ను తనిఖీ నిర్వహించిన ఆయన, అల్పాహారం స్వీకరిస్తున్న ప్రజలతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. ఆహారంలోని ప్రతీ అంశం శుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత లోపాలు బయటపడితే సంబంధిత క్యాంటీన్ నిర్వాహకులపై తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

సిఐటియు మహాసభలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సంతకవిటి

సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ కోరారు. మండలంలోని మండవకురిటి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఆశా వర్కర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా విశాఖపట్నం వేదికగా ఈ నెలాఖరున జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలు రాష్ట్ర కార్మిక ఉద్యమానికి గర్వకారణమని తెలిపారు. ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో ఈ మహాసభలకు ప్రాధాన్యం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని అన్నారు. కార్మికులు దీర్ఘకాలంగా పోరాడి సాధించిన 29 ముఖ్య కార్మిక చట్టాలు రద్దు కావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కోడ్‌లు కార్పొరేట్ వర్గాలకు లాభం చేకూర్చేలా, పని గంటల పెంపు, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ద్వారా దోపిడీ పెరిగేలా రూపొందించారని అన్నారు. స్కీమ్ వర్కర్ల సమస్యలు, విద్య, వైద్య రంగాల పరిస్థితి, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ వంటి అంశాలు మహాసభల్లో ప్రధాన చర్చలుగా ఉండనున్నట్లు సురేష్ తెలిపారు. మహాసభల ముగింపు సందర్భంగా జనవరి 4న విజయవంతంగా నిర్వహించనున్న ఆర్కే బీచ్ భారీ కార్మిక ప్రదర్శనలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ధనలక్ష్మి, రవణమ్మ, యు.వసంత లక్ష్మి, డి. సూర్యుడు, పార్వతి, భారతీ, శాంతమ్మ, రోహిణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



ఆశావర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్

శక్తి యాప్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

శక్తియాప్‌ను విద్యార్థినులు అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవాలని మహిళా పోలీసు స్టేషన్ సిఐ ఇ. నరసింహమూర్తి అన్నారు. మహారాజా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, శక్తీ యాప్, డిజిటల్ అరెస్ట్, పోక్సో చట్టం, మహిళా భద్రత, రహదారి భద్రత, గంజాయి, మాదకద్రవ్యాలు వలన కలిగే అనర్ధాలు గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు పోలీసుశాఖ శక్తి యాప్ ను అందుబాటులోకి తీసుకొని వచ్చిందన్నారు. ప్రతీ ఒక్కరూ తమ మొబైల్స్ లో తప్పనిసరిగా శక్తి యాప్ను డౌన్లోడు చేసుకోవా లన్నారు. ఎవరికైనా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినపుడు మొబైల్ ఫోనులోని శక్తి యాప్ ఎస్ఓఎస్. బటన్ క్లిక్ చేస్తే, దగ్గరలో ఉన్న పోలీసు సిబ్బంది క్షణాల్లో మీ వద్దకు చేరుకొని రక్షణ కల్పిస్తారని తెలిపారు. ఇటీవల కాలంలో డిజిటల్ అరెస్టు పేరుతో నేరగాళ్ళు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. డిజిటల్ అరెస్టు చేసామని బెదిరింపులకు పాల్పడుతూ, డబ్బులను దోచుకుంటున్నారన్నారు. విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి గురించిన సమాచారం ఏదైనా తెలిస్తే డయల్ 100/112 కు లేదా 1972 కు గాని వెంటనే తెలియజేయాలని విద్యార్థులను కోరారు కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ శిరీష, శక్తి బృందం కానిస్టేబుళ్ళు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఈనెల 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులు, బార్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాదులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు ,వాటర్ కేసులు, మున్సిపాలిటీ కేసులు మరియు ప్రి లిటిగేషన్ కేసులు రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలని తెలిపారు.

మోడల్ 2.0 పై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం కోట

వెలుగు మండల సమైఖ్య కార్యాలయంలో నెలవారీ సమావేశంలో భాగంగా ముఖ్యమైన పనులు, బుక్ కీపింగ్. స్వయం సహాయక సంఘాలకు మన డబ్బులు-మన లెక్కలుపై ఎపిఎం పిఎ స్వామి సమీక్షించారు. గ్రామ సహాయకులు, విఒఎలతో చర్చించారు. మండల మొత్తం మీద 1162 పొదుపు సంఘాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిసి లు, అకౌంటెంట్లు, ఎల్‌సిలు పాల్గొన్నారు.

అదనపు ఫీజు వసూలు చేస్తే చర్యలు : డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజు ప్రభుత్వ నిర్ణయం ప్రకారం సాధారణ (రెగ్యులర్) అభ్యర్థుల పరీక్ష ఫీజు రూ.125గా ఖరారు అయ్యిందని, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారాగాని, స్వయంగా కూడా ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లించుకునే సౌకర్యం ఉందని డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. సంబంధిత హెచ్ఎంలు విద్యార్థుల వివరాలను యు డైస్ లో తప్పనిసరిగా ధ్రువీకరించాలన్నారు. ఆ తర్వాతనే విద్యార్థులకు స్వయంగా ఫీజు చెల్లించే అవకాశం అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ఫీజు కంటే అధిక మొత్తాన్ని వసూలు చేస్తున్నారని కొన్ని ప్రైవేట్ పాఠశాలల నిర్వహకులపైనా, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులపైనా ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రభుత్వ నిర్ణయించిన ఫీజును మించి అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఇన్‌స్పైర్ లార్వెన్స్ స్కూల్‌లో జరిగిన అండర్15 ఓపెన్ చదరంగం రాష్ట్రస్థాయి పోటీలలో వివిధ కేటీగిరిలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌కు 6జిల్లాల నుండి సుమారుగా వందమంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో అండర్ 11 స్టేట్ ఫస్ట్ ఎ.పర్వేస్, బాలికలు అండర్ 13లో మొదటిస్థానం జాస్మిన్, రెండో స్థానంలో ఆర్‌వి మాదురి మోక్షిత విజేతగా నిలిచారు. ఈ టోర్నమెంట్‌కు జిల్లా ప్రెసిడెంట్ బిఎ రావు, కార్యదర్శి ఎడి ఎన్ ఎస్ వి ప్రసాద్ అధ్యక్షులుగా వహించారు ముఖ్య అధితులు గా లార్వెన్ స్కూల్ డైరెక్టర్ మండా రవి, శ్రీకాకుళం చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. భీమారావు, అధ్యక్షత వహించారు.

ప్రేమ సమాజానికి వృద్ధుడు తరలింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

పాక్షిక దృష్టి లోపం గల వృద్ధుడైన ఒక వ్యక్తి రోడ్డుపై అగమ్య గోచరంగా తిరుగుతున్న విషయం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత దృష్టికి రాగా ఆమె ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్, సదరు అప్పన్న అనే ఆ వృద్ధుడిని ప్రేమ సమాజం వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఆశ్రమ నిర్వాహకులతో మాట్లాడి అతని బాగోగులు చూసుకోవాలని, సహాయ సహకారాలు కావాలంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో ఎస్‌కెఆర్‌పురం, నల్లబిల్లి సచివాలయాలను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను, మూవ్‌మెంట్ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి చెత్తను సేకరించి విధానంలో పంచాయతీ కార్యదర్శులు తీసుకోవలసిన బాధ్యతలు వివరించారు. గ్రామంలో చేపడుతున్న మహాత్మా జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రమ్ హోమ్‌పై పరీక్ష

వేపాడ: వేపాడ సచివాలయంలో మంగళవారం కౌశలం (వర్క్‌ఫ్రమ్ హోమ్)లో రిజిస్టర్ చేసుకున్న నిరుద్యోగులు పరీక్ష రాశారు. ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు ఒక సెషన్ పరీక్షలు నిర్వహించారు.

ఆస్పత్రిలో పింఛను అందజేత

వేపాడ: పాటూరు గ్రామానికి చెందిన అరిగి వెంకటరమణ అనారోగ్య సమస్యల కారణంగా ప్రస్తుతం విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి ఆదేశాల మేరకు సచివాలయానికి చెందిన మహిళా పోలీస్ వెంకటలక్ష్మి స్వయంగా కెజిహెచ్ ఆసుపత్రికి చేరుకొని పింఛన్ సొమ్మును మంగళవారం అందించడంతో పలువురు అభినందించారు.

రేగిడి: మండలంలోని అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన దార వీరయ్య అనే వృద్ధుడు పక్షవాతంతో శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ కొమ్ము గోవిందరావు ఆస్పత్రికి వెళ్లి పింఛను అందించారు. దీంతో గోవిందరావును గ్రామస్తులు అభినందించారు.

కొత్త కర్రలో ఆధార్ స్పెషల్ డ్రైవ్

మెరకముడిదాం: మండలంలో కొత్తకర్ర గ్రామంలో సర్పంచ్ బూర్లె పార్వతమ్మ, వైసిపి మండల జనరల్ సెక్రెటరీ బూర్లె సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ క్యాంపెయిన్ మంగళవారం నిర్వహించారు. చుట్టు పక్కల పలసర గ్రామాల నుంచి ఈ ఆధార్ క్యాంపెయిన్‌కి అనూహ్య రీతిలో ఎక్కువ మంది రావడం పట్ల సురేష్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ క్యాంప్‌లో విద్యార్థులకు, పింఛనుదారులకు ఆధార్‌లో తప్పులు సవరిస్తున్నారు.

అపరాల పంటలతో భూసారం

శృంగవరపుకోట: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా అపరాల పంటలతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టిమాటిక్ లీడ్ ప్రకాష్, హేమసుందర్ తెలిపారు. మండలంలోని తిలారి, పసి, పెదకండేపల్లి గ్రామాలలో రైతులతో వారు మంగళవారం మాట్లాడారు. అపరాలలో ప్రతి అయిదు అడుగులకు వరుస పద్ధతిలో గోంగూర, తెల్లజొన్న, సజ్జలు, రాగులు, బెండ, గోరుచిక్కుడు, బొబ్బర్లు ఆర్‌డిఎస్ విధానంలో వేయడం వల్ల కలుగు ఉపయోగాలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంటిలెట్, ఎఫ్ఎంటి కృష్ణ, రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో నాయకత్వ లక్షణాలు

శృంగవరపుకోట: ప్రత్యేక సేవా శిబిరాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. జాతీయ సేవా పథకం యూనిట్- 1 ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరాన్ని మంగళవారం బర్మా కాలనీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ యువతలో ప్రత్యేక సేవా శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత సమాజం పట్ల నిస్వార్థంగా చేయాల్సిన సేవా నిబద్ధత వంటి లక్షణాలు అలవడతాయని అన్నారు. డాక్టర్ చుక్క శ్రీకాంత్ అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 పిఒ భాస్కర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

రేగిడి: మండలంలోని లచ్చన్నవలస పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన తెంబూరు చంద్రశేఖర్, రంప రామలింగేశ్వర రావు శర్మలకు ఎంఇఒ ఎం.వరప్రసాదరావు సాలువాలతో మంగళవారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు సృజనాత్మకత విద్యను అందించిన ఉపాధ్యాయులు ఎల్లవేళలా విద్యార్థులకు, విద్యార్థులు తల్లిదండ్రులకు గుర్తుంటారన్నారు. ఉద్యోగులు ఎక్కడైతే పూజింపపడతారో అక్కడ మంచి పేరు ప్రఖ్యాతలు పొందుతారన్నారు. ఇలానే నడవడక ఉండాలన్నారు. వీరితోపాటు తిరుపతి, ప్రసాదరావు, సూర్యారావు ఎస్ఎంఎస్ చైర్మన్ ఉన్నారు.

అవంతిలో క్యాంపస్ డ్రైవ్

భోగాపురం: మండలంలోని కవులవాడ, తగరపువలసలోని అవంతి కళాశాలలో మంగళవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 24 / 7 ఎఐ బెంగళూరుకు చెందిన బహుళ జాతి కంపెనీ హెచ్‌ఆర్ టీం పాల్గొనగా కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు 99 మంది పాల్గొన్నారు. ఇందులో మొదట రౌండ్‌లో 53 మంది ఎంపిక కాగా ఫైనల్ రౌండ్‌లో 10 మందిని చివరిగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరిని ఎంపిక చేశారు. వీరిలో ఆర్.ఆంటోనిప్రీతం, పి.ఇంద్రావతి సైబర్ సెక్యూరిటీకి ఎంపికయ్యారు. ఎంపికైన వారికి రూ.2.5 లక్షల వార్షిక ప్యాకేజీని ప్రకటించారు. తమ కళాశాల విద్యార్థులు 24/ 7 ఎఐ క్యాంపస్ డ్రైవ్‌కి ఎంపిక కావడం పట్ల అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు అభినందించారు.

ఆకలి బాధలు మంత్రి పట్టించుకోవాలి

జామి: జిల్లాలో ఏకైక భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మూతపడి ఐదు సంవత్సరాలు పూర్తి కావచ్చినా నేటికీ కార్మికుల, ఉద్యోగులకి పిఎఫ్, గ్రాట్యుటీ చెల్లించకపోవడం తీరని అన్యాయమని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. మంగళవారం భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన పనికిమాలిన నిర్వాకం వల్ల జిల్లాలోని చెరకు రైతులు, కార్మికులు, ఉద్యోగులు వీధిన పడిపోయారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక న్యాయం జరుగుతుందని అనుకుంటే కార్మికుల, ఉద్యోగుల, రైతు సమస్యలపై మంత్రి కొండపల్లి స్పందచడంలేదన్నారు. ఈ సమావేశంలో రౌతు కనకరాజు, ఉంగరాల శ్రీను, ఆదిబాబు, చలుమూరి వెంకటరావు, బంగారయ్య, మధు, సత్తిరాజు, నారాయణరావు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష

తెర్లాం: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌లకు తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ రాంబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన దరఖాస్తుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో నిర్దేశిత అన్ని డాక్యుమెంట్‌లూ ఉంటేనే అప్లయ్ చేయాలన్నారు. నిర్ణీత రుసుము కంటే అధికంగా రుసుము వసూలు చేయరాదన్నారు. సచివాలయ సర్వీసులు పెండింగ్ ఉన్నవి, ఎప్పటికప్పుడు సంబంధిత కార్యదర్శులు తెలపాలన్నారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని తమ దృష్టికి వచ్చిందని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుదలకు ఉపాధ్యాయులు కష్టించి పనిచేయాలని ఎంఇఒ తిరుమల ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని నాయుడువలస యుపి పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. అన్ని పాఠ్యాంశాలలో బోధన పూర్తిచేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పాఠాలకు సంబంధించి ప్రశ్నలు అడిగారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి ప్రత్యేక బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రెడ్డి వేణు, ఉపాధ్యాయులు జెసిరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

మెంటాడ: మండలంలోని జిటిపేట గ్రామంలోని అంగన్వాడీ 1,2 కేంద్రాలను గజపతినగరం ఐసిడిఎస్ పిఒ ఎం.రాజేశ్వరి మంగళవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు. సెంటర్‌లో ముగ్గురు పిల్లలు నమోదు కాగా, సందర్శన సమయంలో ఇద్దరు మాత్రమే హాజరయ్యారని గమనించిన పిఒ పిల్లలను సెంటర్‌కు రప్పించడం అంగన్వాడి కార్యకర్తల బాధ్యత అని అంగన్వాడీ టీచర్‌ను ఆమె ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించవలసిన పోషకాహారం వివరాలు ఉండే మెను చార్ట్ సెంటర్‌లో లేకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే మెను చార్ట్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - గజపతినగరం

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రగ్బీ పోటీల్లో మండలంలోని మధుపాడ సాయి గౌతమ్ పాఠశాలకు చెందిన బి.సాయికుమార్, పి.కావ్య, ఎస్.జాహ్నవి, ఒ.శ్రీవిద్య పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు ఈ విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై అక్కడి కూడా ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.ఎస్. నాయుడు మంగళవారం తెలిపారు. ఈ విద్యార్థులు గత నెల 28, 29, 30 తేదీలలో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పొదలకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారని అభినందించారు.



గజపతినగరం: రగ్బీలో సత్తా చాటిన సాయి గౌతమ్ విద్యార్థులు

కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ

కొత్తవలస: విశాఖ జిల్లా గాజువాక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇన్విటేషన్ నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ 2025 పోటీల్లో ఒకినావా మాస్టర్స్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన 26 మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఇందులో గోల్డ్ మెడల్స్ 11, సిల్వర్ మెడల్స్ 13, బ్రాంజ్ మెడల్స్ 16 బహుమతులు సాధించారు. కోచ్ కె.సూర్య నూకరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

రామభద్రపురం: మండల పరిధిలోని ఆరికతోట జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన కోరాడ నికిల్ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికై నట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొత్స రత్నకిశోర్ తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నెలలో ఢిల్లీలో జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున జాతీయ స్థాయిలో పాల్గొనే 16 మంది సభ్యుల జట్టులో నికిల్ కూడా ఒక క్రీడాకారుడుగా ఎంపికైనట్లు తెలిపారు. ఇటీవల కడప జిల్లా పులివెందులలో జరిగిన 69వ అండర్-14 సాఫ్ట్ బాల్ పోటీల్లో విజయనగరం జిల్లా బాలుర జట్టులో రాష్ట్రస్థాయిలో నికిల్ 3వ స్థానం సాధించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈయన ఎంపిక పట్ల పాఠశాల హెచ్ఎం కృష్ణవేణి, సర్పంచ్ పెంకి పుష్పమ్మ, వైస్ ఎంపిపి పెంకి అరుణ, ఉపాధ్యాయులు రమణమూర్తి, సిబ్బంది అభినందించారు.


కొత్తవలస: కరాటేలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు

సైన్స్, క్రీడల్లో సత్తా

సంతకవిటి: మండలంలోని మండవకురిటి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన చూపారు. కౌశల్ -2025 సైన్స్ క్విజ్‌లో జిల్లాలో 1వ ర్యాంక్ సాధించిన 8వ తరగతి విద్యార్థి పి. తనుష్, ఈనెల 27న తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. 9తరగతి విద్యార్థిని మీసాల భవ్యశ్రీ జావిలిన్‌త్రో పోటీలో జిల్లాస్థాయిలో 3వ ర్యాంక్ సాధించారు. ఈ విజయాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రమణమ్మ, వ్యాయమ ఉపాధ్యాయులు సుదర్శన్‌రావు, ఎస్ఎంసి చైర్మన్, సైన్స్ ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మానసిక వికలాంగుల పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక రాంజీనగర్‌లో ఉన్న చైతన్య మానసిక వికలాంగుల పాఠశాలను విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు మంగళవారం సందర్శించారు. మానవతా దృక్పథంతో మెలగాలని తోటి వారికి సహాయం చేసే విధంగా ఉండాలని, మానవసేవయే మాధవ సేవ అని, ఇటువంటి సేవ చేయడం చాలా అదృష్టమని ప్రిన్సిపాల్‌ని, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ సిహెచ్ షణ్ముఖరావు, ఎస్ఐ ఎన్.జనార్ధన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

బొబ్బిలి : పెండింగ్ చలానాలను ట్రాఫిక్ పోలీసులు కట్టించారు. స్థానిక మోర్ షాపు, శ్రీవేణుగోపాల స్వామి ఆలయం జంక్షన్లో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలకు ఉన్న పెండింగ్ చలానాలను కట్టించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేశారు. లైసెన్స్, వాహన పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ హెచ్చరించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని కోరారు. కార్యక్రమంలో ఎఎస్ఐ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

తుపానుతో రైతులకు ఇబ్బందులు

◆చేతికి అందిన పంట పోతాదేమోనని ఆందోళన ◆పొలాల్లో చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి- డెంకాడ

దిత్వా తుపాను కారణంగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చేతికి అందిన పంట ఈ వర్షంతో పోతాదేమోనని రైతుల భయాందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పెట్టుబడులు పెట్టి పండించిన వరిపంట ఈ తుపాను ప్రభావంతో నేలమట్టమైపోతుందేమోనని అన్నదాత ఆందోళణ వ్యక్తం చేస్తున్నాడు. దీంతో పంటను వర్షం నుంచి కాపాడుకోవడానికి నాన తంటాలు పడుతూ రాత్రి పగలు పరుగులు పెడుతున్నాడు. ఇప్పటికే కోసేసిన పంటను కాపాడుకోవడానికి పాట్లు పడుతున్నారు. మరి కొంత మంది కోసిన వరిని చిన్నచిన్న దిబ్బలుగా పెట్టి వాటిని తడవకుండా కాపాడుకునేందుకు పరదాలు కప్పి ఉంచుతున్నారు. ఇంకొంత మంది మిషన్ ద్వారా వరిని కోసి ధాన్యాన్ని ఆడించుకొని ఏ రాత్రైనా ఇంటికి తెచ్చుకుంటున్నారు. ఇలా రైతులు తమ పంటను కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఉబాలు నుంచి ఇప్పటి వరకూ వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి చేతికి అందిన పంట వర్షం రూపంలో పోతాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వర్షం ఆగితే రైతుకు నష్టం వాటిల్లదని లేకపోతే రైతు నష్టపోతాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పొలాల్లో చేరిన వర్షపు నీరు


వర్షానికి తడవకుండా కుప్పలపై వేసిన టార్పాలిన్లు

చినబాబు పెద్ద సాయం

◆ మొన్న క్లాస్ రూముల గేట్లకు వితరణ ◆ నేడు రీడింగ్ ఏరియా అభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జామి

రాజకీయాలు చేయడమంటే డబ్బు గడించడమే అని, అనుకున్న వారే అధికం. అందులో వాస్తవం కూడా లేకపోలేదు. కానీ రాజకీయాల్లో ఉన్నవారు ప్రజా సమస్యల పట్ల స్పందించిన వారూ ఉన్నారు. అలాంటి కోవకు చెందిన వారిలోకి బండారు చినబాబు కూడా వస్తారు. ఈయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాకుండానే, గ్రామ సమస్యలపై అనుక్షణం స్పందిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో అనేక సమస్యల పరిస్కారానికి నేనున్నానంటూ, ముద్దుకొస్తున్నారు. ఇటీవల జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులు నిర్వహణకు అవసరమైన ఇనుప గ్రిల్ తయారీకి రూ.50వేలు వితరణ అందించారు. తాజాగా పాఠశాలలో రీడింగ్ జోన్ ఏర్పాటు చేయడానికి రూ.40 వేలతో కసర బుగ్గిని తెచ్చి లెవెల్ చేపించారు. సాయి కృష్ణ క్రషర్ ఓనర్ అల్లు శ్రీమన్నారాయణ కూడా పాఠశాలకు ఐదు లోడ్లు కసర బుగ్గిని ఉచితంగా ఏర్పాటు చేసి సాయంలో చేయి కలిపారు. ఇలా గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చినా, చినబాబు వారి కుమార్తె శ్రీమతి బండారు వేణు మాధురి పేరిట ఆర్థిక సాయం చేస్తున్నారు. రీడింగ్ జోన్ ఏర్పాటుకు గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్స్ జి శివ, ఎర్నాయుడు, అచ్చం నాయుడు, శ్రీను, ఎ.నరేష్, ఏ ఎర్నాయుడు, సతీష్, బుజ్జి పాఠశాలకు కావలసిన కసర బుగ్గిని ఉచితంగా రవాణి చేశారు. ఈ కార్యక్రమం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభింనదించారు. విద్యార్థుల పట్ల గ్రామస్తులు చూపించే ఆధరాభిమానాలు ఎన్నటికీ మరువలేనివని, విద్యార్థులు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామని ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా చినబాబు కుమార్తె బండారు వేణుమాధవికి, శ్రీమన్నారాయణ, స్పందించిన స్థానిక టాక్టర్ యజమానులకు విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జామి ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొత్తలి శ్రీను, ఎంపిటిసి 2 వరలక్ష్మి భర్త ఆంజనేయులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.


పాఠశాల ఆవరణలో పనులు పరిశీలిస్తున్న నాయకులు

15న ఎన్‌జిఒ తాలూకా యూనిట్ ఎన్నికలు

ప్రజాశక్తి -గజపతినగరం

గజపతినగరంలో ఎపిఎన్‌జిఒ అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారిగా నియమితులైన ఎ. శ్రీధర్ కుమార్ విడుదల చేశారు. ఈ యూనిట్‌లో మొత్తం 15 పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 5వ తేదీన ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ గజపతినగరం మండల కేంద్రంలో ఏపీ ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించనున్నారు. గజపతినగరం, దత్తిరాజేరు, వేపాడ, మెంటాడ మండలాలలోని గెజిటెడ్, నాన్-గెజిటెడ్ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కార్యవర్గం కోరింది.

తెర్లాం : మండలంలో ఎపి ఎన్‌జిఒ తెర్లాం తాలూకా యూనిట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను మంగళవారం ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణ విడుదల చేశారు. ఈ నెల 15వ తేదీన 15 పోస్టు లకు గాను ప్రెసిడెంట్, సెక్రెటరీ, కోశాధికారి, అసోసియేట్ ప్రెసిడెంట్, ఆర్గనైజర్, మహిళా వైస్ ప్రెసిడెంట్, ఇతర పదవులకు ఎన్నికల ఉంటుందన్నారు. ఈ నెల 8న 2 గంటల నుంచి 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఎన్నిక వాసవి కళ్యాణ మండపంలో నిర్వహిస్తామని, తెర్లా, బాడంగి మండలాల ఎపి గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు పాల్గొని ఎన్నికల విజయవంతం చేయాలని కోరారు.

13న భోగాపురం తాలూక యూనిట్ ఎన్నిక

భోగాపురం: నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘం, భోగాపురం తాలూకా యూనిట్ ఎన్నికలు డిసెంబరు 13న జరగనున్నాయని ఎన్నికల అధికారి ఎల్. అప్పలనాయుడు తెలిపారు. సహాయ ఎన్నికల అధికారి గా ఎం.అప్పలస్వామి, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ఉపాధ్యక్షులు కె.ఆదిలక్ష్మి వ్యవహరిస్తారన్నారు. ఈ యూనిట్‌లో నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక కోసం 6న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియ అంతా భోగాపురం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని, భోగాపురం, పూసపాటిరేగ డెంకాడ మండలాల గెజిటెడ్, నాన్ గెజిటెడ్ మెంబర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఈనెల 19న ఎన్‌జిఒ బొబ్బిలి తాలూకా ఎన్నిక

బొబ్బిలి: ఎపిఎన్‌జిఒ సంఘం బొబ్బిలి తాలూకా యూనిట్ ఎన్నిక ఈనెల 19న జరగనున్నట్లు ఎలక్షన్ అధికారి ఎన్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 15 పదవులకు ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నికకు ఈనెల 12న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని చెప్పారు. బొబ్బిలి అర్బన్, రూరల్, రామభద్రపురం మండలం గజిటెడ్, నాన్ గజిటెడ్ ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- బొండపల్లి

కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వేంద్రాం సమీపంలో మండల వైసిపి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజలలో రోజు రోజుకీ వ్యతిరేకత పెరుగుతుందన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో సిఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ విఫలమయ్యారని ఆరోపించారు. పింఛన్ల మంజూరులో ప్రభుత్వం ఆలస్యం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పద్దెనిమిది నెలలు కావస్తున్నా నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో ఎంపిపిలు చల్లా చల్లంనాయుడు, గేదెల సింహాద్రి అప్పలనాయుడు, పీరుబండి జై హింద్ కుమార్, వైఎస్ ఎంపిపిలు గొండెల ఈశ్వరరావు, మిత్తిరెడ్డి రమేష్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు బొద్దల చిన్నం నాయుడు, అప్పారావు, బండారు బంగారం, మహంతి రమణ, సర్పంచులు కర్రోతు శ్రీనివాసరావు, లండ నారాయణమ్మ, తాళ్ళపూడి కీర్తి, మునకాల పైడిపునాయుడు, సిరిపరపు ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి శిక్షణ

గజపతినగరం : స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం విజన్ బిల్డింగ్‌పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ సంఘాల విఒఎ అధ్యక్షులు, విఒఎలు, సీసీలు, ఎపిఎంలు హాజరుకావాలని మహిళా సమాఖ్య నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా సంఘాల లక్ష్యాలను, భవిష్యత్ ప్రణాళికలను నిర్దేశించుకోవడంలో 'విజన్ బిల్డింగ్' కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

బకాయి జీతాలు విడుదల చేయాలి



చెత్తకు పూజ చేసి నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - రామభద్రపురం

రామభద్రపురం మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 4 నెలల వేతనాలు చెల్లించకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వినూత్న రీతిలో చెత్తను పోగుచేసి మంత్రాలు చదువుతూ పూజలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి నిత్యం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ శ్రమిస్తున్న కార్మికులకు జీతాలు సకాలంలో రాకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిత్యం అపరిశుభ్ర వాతావరణంలో ఎండా, వాన, చలికి లెక్కచేయక పనిచేస్తున్న వీరికి రక్షణ పరికరాలు, యూనిఫామ్, సబ్బులు ఇవ్వక పోవడం దారుణం అన్నారు. బకాయిపడ్డ జీతాలు వెంటనే విడుదల చేసి పెరిగిన ధరలకు అనుగుణంగా 15 వేలు వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవు పెట్టినా సెలవు పేరుతో జీతంలో విధించే కోతలు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శ్యామల, భవాని, విజయ్, పరమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇరుకు గదుల్లోనే..

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ సచివాలయంలో వెల్నెస్ భవనం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో 1997లో నిర్మించిన పాత పంచాయతీ భవనం ఇరుకు గదిలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి నూతనంగా నిర్మించిన వెల్నెస్ వైద్య సేవలు భవనాన్ని ప్రారంభించి గ్రామ ప్రజలకు సేవలు అందించే విధంగా గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

172వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవర ప్రాంతంలో జిందాల్ కంపెనీ నిర్వహిస్తున్న తీరుకు వ్యతిరేకంగా నిర్వాసితులు చేపట్టిన నిరసనలు, నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 172వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బాధితులు తమ భవిష్యత్తు, తమ పిల్లల భవిష్యత్తును అన్యాయం చేసిన జిందాల్ కంపెనీపై, ఆ కంపెనీకి అండగా నిలబడుతున్న ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతులకు, స్థానికులకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వం, కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్న తీరును నిర్వాసితులు ఘాటుగా ప్రశ్నించారు. కంపెనీ మోసానికి వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం సహకరించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయ పరమైన డిమాండ్‌లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించే ప్రయత్నాలను వైసిపి బలంగా వ్యతిరేకిస్తోందని, ఇందులో భాగంగా కోటి సంతకాలు సేకరిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస జంక్షన్లో కోటి సంతకాలు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని సంతకాలు చేసి భాగస్వాములు అయ్యారని కడుబండి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొరపల్లి శివ, జెసిఎస్ కన్వీనర్ బొంతల వెంకట్రావు, గొరపల్లి రవికుమార్, చింతలపాలెం పల్ల భీష్మ, పి ఎస్ఎన్ పాత్రుడు, లెంక రామన్నపాత్రుడు, ఆదిరెడ్డి అప్పన్న (నాయుడు), కె.మాధవరావు, లెంక వెంకన్నపాత్రుడు, పుసర్ల రఘు, కారుమూరి కృష్ణ, సూరిబాబు, రామకృష్ణ, రమణబాబు, వై.రామకృష్ణ, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

'పది' పరీక్ష ఫీజు రూ.125

రామభద్రపురం: పది పబ్లిక్ పరీక్ష ఫీజు రూ.125 మాత్రమే చెల్లించాలని ఎంఇఒ తిరుమల ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సి బోర్డు విడుదల చేసిన ఫీజు సాధారణ అభ్యర్థులకు రూ.125 మాత్రమేనన్నారు. ఈ ఫీజును సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా లేదా విద్యార్థులు స్వయంగా కూడా ఆన్‌లైన్‌లో చెల్లించుకోవచ్చునన్నారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వివరాలను యూడిఐఎస్‌ఈలో తప్పనిసరిగా ధృవీకరించాలన్నారు. ఆ తర్వాతనే విద్యార్థులకు స్వయంగా ఫీజు చెల్లించే అవకాశం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విద్యార్థులు స్వయంగా ఫీజు చెల్లించినట్లయితే, ఆ చెల్లింపు విషయాన్ని సంబంధిత ప్రధానోపాధ్యాయులకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే అధిక మొత్తాన్ని వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. ఈ నిబంధన అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకి వర్తిస్తుందన్నారు.


బాధితునికి చెక్కు అందిస్తున్న తెంటు లక్ష్మునాయుడు

లారీ, వ్యాన్ ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- దత్తిరాజేరు

మండలంలోని మర్రివలస సమీపంలో జాతీయ రహదారిపై లారీ, వ్యాను ఢీకొని వ్యాన్ డ్రైవర్ మంగళవారం మృతి చెందాడని ఎస్‌బూర్జువలస ఎస్ఐ రాజేష్ తెలిపారు. రామభద్రపురం నుంచి విజయనగరం వెళ్తున్న లారీనీ గజపతినగరం నుంచి రామభద్రపురం వైపు ఎదురుగా వస్తున్న వ్యాన్ రాజుగారి మామిడి తోట జంక్షన్ వద్ద బలంగా ఢీ కొట్టింది. లారీ డ్రైవర్ ఆయన మార్గంలోనే రోడ్డు మీద వెళ్తుండగా వ్యాన్ డ్రైవర్ లారీ పక్క నుంచి వచ్చి గట్టిగా ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని 108కి ఫోన్ చేసి వెంటనే చికిత్స నిమిత్తం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. వ్యాన్ డ్రైవర్ ఒరిస్సాకి చెందిన వ్యక్తి అని అనుకుంటున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి- బాడంగి

పేద ప్రజల ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యం అని మాజీ ఎమ్మెల్యే, బుడా చైర్మన్ తెంటు లక్షము నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలో కోడూరు గ్రామానికి చెందిన మరిపి దినేష్‌కి రూ. 35 వేలు సిఎం సహాయ నిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వ్యాధులు, ప్రమాదాల వల్ల ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని, ఈ సహాయం వారికి ఉపశమనం ఇస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదలకు అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, వైస్ ఎంపిపి భాస్కర్‌రావు, పిసిసి అధ్యక్షులు ఎల్. సత్యనారాయణ, నాయకులు మరిపి రమేష్ తుదితురులు పాల్గొన్నారు.

ఇళ్ల దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

శృంగవరకుకోట: గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలకు సొంతిల్లు నిర్మాణానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గ్రామీణ పథకం 2.0 క్రింద గ్రామీణ పేదలకు గృహ వసతి కల్పించేందుకు దరఖాస్తుల స్వీకరణ గడువును కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 14 వరకు పొడిగించిందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారు తమ గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్, గృహ నిర్మాణ శాఖ ఎఇ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వేపాడ: ఇంటి నిర్మాణానికి ముందుకొచ్చిన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 14 వరకూ గడువు ఉందని హౌసింగ్ ఎఇ గంగాధర్ తెలిపారు. పూర్తి సమాచారం కోసం గ్రామ సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. గృహ నిర్మాణం కోసం రూ. 2.50 లక్షలు వరకు ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందుతుందని చెప్పారు. ఇంటి స్థలం లేని వారికి మూడు సెంట్లు స్థలం, ఆర్థిక సహాయం అందజేస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.